# ముఖ్యమంత్రి కార్యాలయం

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 తేదిః 11-08-2015

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అధ్యక్షతన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీలో **'గ్రామజ్యోతి'** అవగాహన సదస్సు జరిగింది. డిప్యూటి సిఎం కడియం శ్రీహరి, మంత్రులు కె. తారక రామారావు, ఈటెల రాజెందర్, పోచారం శ్రీనివాస రెడ్డి, టి. హరీష్ రావు, తుమ్మల నాగేశ్వర్ రావు, జోగు రామన్న, ప్లానింగ్ వైస్ చైర్మన్ నిరంజన్ రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు జాయింట్ కలెక్టర్లు, జడ్పీ సిఇఒలు, డిపిఓలు, మండలాల చేంజ్ ఏజెంట్లు పాల్గొన్నారు. పంచాయితీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు ఇతర శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ ప్రారంభ ఉపన్యాసం చేశారు.

## మెదటి సెషన్ లో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ

"ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో కావాల్సినంత గుణాత్మక మార్పు రాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో మంచి పద్దతిలో అభివృద్ది జరగలేదు. మానవ వనరులకు మించిన సంపద లేదు. ప్రజల సంఘటిత శక్తిలోని బలాన్ని ప్రజలకు చెప్పలేకపోయాం. స్థానిక సంస్థల ఆధ్వర్యంలో కొంత పని జరుగుతున్నప్పటికీ, అనుకున్న స్థాయిలో జరగడంలేదు. ఈ పరిస్థితుల్లో మనం గ్రామజ్యోతి కార్యక్రమం తీసుకున్నాం. మార్పు సాధకులు (చేంజ్ ఏజెంట్స్) చాలా క్రియా శీలకంగా పనిచేయాలి. ఒక స్థితి నుంచి మరో స్థితికి గ్రామ పంచాయితీలను తీసుకెళ్లాలి. ప్రారంభంలో కొంత ఇబ్బంది కూడా ఎదురయ్యే అవకాశం వుంది కానీ స్థిరంగా పని చేసుకుపోవడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చు. మొన్న నేను దత్తత తీసుకున్న చిన్న ముల్కనూరుకు వెళ్లాను. అక్కడ పరిస్థితి బాగా లేదు దాదాపు అన్నిగ్రామాల్లో ఇదే పరిస్థితి వుంది. మీరు గ్రామాలకు వెళ్లినపుడు కూడా నిరుత్సాహ పరిస్థితి వుంటుంది. కాని నీరు కారి పోకూడదు. గ్రామానికి వెళ్లగానే గ్రామ పరిస్థితిపై అంచానాకు రావాలి. గ్రామ ప్రజలతో కలిసి ప్రణాళిక రూపొందించాలి. సంఘటిత శక్తిలోనే బలముంది అని ప్రజలకు చెప్పాలి. ప్రజలు కలిసి పనిచేస్తే మార్పు సాద్యమనే విషయం చెప్పాలి. గ్రామానికి ఏమి అవసరం? మౌళిక

సదుపాయాల పరిస్థితి ఏమిటి? అనే విషయాలపై అంచనాకు వచ్చి ప్రణాళిక సిద్ధం చేయాలి" అన్నారు.

"అభివృద్ధి కోసం చట్టసభల సభ్యులు, స్థానిక సంస్థల ద్వారా చాలా డబ్బులు ఖర్చు అవుతున్నాయి. అయినా గ్రామాల్లో మంచి పద్ధతిలో అభివృద్ధి జరగడం లేదు. ప్రణాళికా బద్ధంగా నిధులు ఖర్చు కాకపోవడం, ప్రజలు ప్రణాళికలో భాగం కాకపోవడం వల్లే ఈ పరిస్థితి వుంది. బాగుపడిన గంగదేవిపల్లి, అంకాపూర్, ముల్కనూర్ గ్రామాలు మన తెలంగాణలోనే వున్నాయి. పంచాయితీ రాజ్ వ్యవస్థ, సహకార వ్యవస్థలు ఈ గ్రామాల్లో పటిష్టంగా వుంది. వీటిని ఉదాహరణలుగా తీసుకోవాలి. గ్రామ కమిటీలు వేసుకుని అభివృద్ధి చెందుతున్నారు. అలాగే అన్ని గ్రామాలు ముందుకుపోవాలి. దేశంలోని చాలా గ్రామాలు గంగదేవిపల్లిని, వ్యవసాయాభివృద్ధి కోసం అంకాపూర్‌ను, సహకార సంఘాల పనితీరు గురించి ముల్కనూర్‌ను చూసి నేర్చుకుంటున్నాయి. మన రాష్ట్రంలోని అన్ని గ్రామాలు కూడా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి. గ్రామాలను ఇలాగే వదిలిపేయవద్దు, చిత్తశుద్ధితో పనిచేస్తే ఫలితాలుంటాయి. స్థిరమైన ప్రయత్నం చేస్తే ఏదైనా సాధించవచ్చనే దానికి **'తెలంగాణ రాష్ట్ర సాధనే'** మంచి ఉదాహరణ'' అని ముఖ్యమంత్రి అన్నారు.

"ప్రభుత్వం ఏదైనా కార్యక్రమం ప్రవేశపెడితే వెంటనే నిధులు ఎన్ని వస్తాయి అనే ప్రశ్న ముందుకొస్తుంది. ఈ కార్యక్రమానికి డబ్బులు ప్రధానమే కాదు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను తీర్చిదిద్దుకోవడమే లక్ష్యం. ప్రభుత్వం ఆర్థిక ప్రేరణ కల్పిస్తుంది. రాబోయే నాలుగేళ్లలో వివిధ శాఖల ద్వారా రు. 25 వేల కోట్లు ఖర్చు పెడతాం. ఇది కేవలం సర్పంచ్‌ల కార్యక్రమం కాదు. అందరిదీ. గ్రామసభల్లో సర్పంచ్, ఎంపిటిసి, ఎంపిపి, జడ్‌పిటిసిలు పాల్గొని గ్రామాల ప్రణాళికలు తయారు చేయాలి. గ్రామానికి వున్న అవసరాలేంటి అనేది గుర్తించి, నిధులపై అంచనా వేసుకుని ప్రణాళికలు రూపొందించాలి. ఎమ్మెల్యేలు మండలానికో గ్రామాన్ని దత్తత తీసుకుని ప్లాన్ చేయాలి. ఆ గ్రామాలను మిగతా గ్రామాలకు ఆదర్శంగా చూపాలి'' అని సిఎం చెప్పారు.

"గ్రామాల్లో, పట్టణాల్లో మార్పు వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. స్థానికంగా ఏది అవసరమో గుర్తించి, ఆ పనులు చేయాలి. గ్రామాల్లో స్మశాన వాటికల నిర్మాణం, డంప్ యార్డుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రామాలకు 25 వేల రిక్షాలు చెత్త సేకరించడానికి ప్రభుత్వం కొనిస్తుంది. 750 జనాభాకు ఒక మూడు చక్రాల రిక్షాలు ఇస్తాం. ఛేంజ్ ఏజెంట్లుగా

వెళ్లిన వారు చిత్తశుద్ధితో పనిచేస్తే గ్రామాలు, తద్వారా రాష్ట్రం బాగుపడుతుంది. ఏ గ్రామానికి ఏ పథకం ద్వారా ఎన్ని నిధులు వస్తాయో కూడా అధికారులకు ముందే తెలుపుతాం. వాటిని సద్వినియోగం చేయాలి. కానీ ఏ పనులు చేయాలనే విషయం మాత్రం గ్రామస్తులే నిర్ణయించాలి. గ్రామంలో ఒకరోజు పవర్‌డే నిర్వహించుకోవాలి. వంగిన పోళ్లను, వేలాడే వైర్లను సరిచేయాలి. గ్రామంలో అన్ని ఇండ్లకు టాయిలెట్స్ ఉండాలి. వాటిని వాడేలా చూడాలి. గ్రామ పారిశుద్ధ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. యువశక్తిని, మహిళా శక్తిని బాగా ఉపయోగించుకోవాలి. హరిత హారం కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలి'' అని కేసిఆర్ చెప్పారు.

"గ్రామాల్లో వెలుగులు నింపడమే గ్రామ జ్యోతి లక్ష్యం. గ్రామ ప్రణాళిక రూపొందించే క్రమంలో ప్రత్యేకమైన సమస్యలను గుర్తించాలి. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిని గుర్తించి వైద్యం చేయించాలి'' అని సూచించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం